
# శేషవస్త్రం

## మల్లాది వెంకటకృష్ణమూర్తి




అదో ప్రాచీనమైన వైష్ణవాలయం.

కొండపైన ఉన్న ఆ లక్ష్మీ నృసింహ స్వామి ఆలయానికి ఆంధ్రరాష్ట్రం నించే కాక పొరుగున ఉన్న కర్నాటక, మహారాష్ట్రల నించి కూడా వేల సంఖ్యలో భక్తులు వస్తూంటారు. ప్రభుత్వ దేవాదాయశాఖ స్వాధీనం చేసుకున్న ఆలయాలలో అదొకటి.

ఆ ఆలయ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌కి ముందు పోస్ట్ ద్వారా, తర్వాత ఫోన్ ద్వారా, దేవాదాయ మంత్రిత్వ శాఖామాత్యులు ఫలానా రోజున తన కుటుంబ సభ్యులతో వస్తున్నారని, వారిని సగౌరవంగా రిసీవ్ చేసుకుని తగిన ఆలయ మరియు అతిథి మర్యాదలు జరపమని ఆదేశాలు వచ్చాయి.

ఆలయ ఇ.ఓ. వెంటనే బీరువాలోంచి, సరిగ్గా ఈ అవసరం కోసమే దాచిన, ఎన్నడో ఓ భక్తుడు సమర్పించిన పట్టు పంచెని, పట్టు ఉత్త

మీ కలలను నిజం చేసుకోండి
మీరు ఊహించని మరియు ప్రణాళికాబద్ధమైన వ్యయాలను తీర్చేందుకు మీకవసరమైన ఆర్థిక సహాయాన్ని ఆంధ్రాబ్యాంక్ అందిస్తోంది. మీ కలల సౌధాన్ని నిర్మించుకోండి, మీ బిడ్డను చదివించండి. కొత్తకారు కొనండి ఇక జీవితంలోని సౌఖ్యాలను అందుకోండి...
సులభంగా లభించే, సునాయాసంగా చెల్లించదగు స్వల్ప వడ్డీ రుణాలతో!
వీటి కోసం కూడా మా ప్రత్యేక రుణాలు పొందండి: • గృహనిర్మాణరుణాలు • విద్యారుణాలు • వ్యక్తిగత రుణాలు • పింఛనుదార్లకు రుణాలు
క్రెడిట్ కార్డులు
ఆంధ్రాబ్యాంక్ ANDHRA BANK
(భారత ప్రభుత్వ సంస్థ)
ప్రధాన కార్యాలయం : డా. పట్టాభి భవన్, సైఫాబాద్, హైదరాబాద్ - 500 004.



రీయాన్ని, పట్టు చీర, రవికలని తీసాడు. ప్రధాన అర్చకుడిని పిలిపించి మంత్రి రాక గురించి చెప్పి, ఆ పట్టు వస్త్రాలని మంత్రికి, ఆయన భార్యకి శేషవస్త్రాలుగా సమర్పించాల్సిందిగా ఆదేశించాడు. అంతేకాక డ్యూటీ రోస్టర్‌లో ఆ రోజు అర్చకులెవరో చూసి, రామాచార్యులని పిలిపించి తగిన సూచనలిచ్చాడు.

''జాగ్రత్త స్వామీ! నెలన్నర క్రితం మంత్రిగారు శ్రీకాళహస్తి వెళ్లినప్పుడు అక్కడ ఆలయ మర్యాదలు తనకి సరిగ్గా జరగలేదని అర్చకుడ్ని, ఇ.ఓని సస్పెండ్ చేసాడు. వారికి చేయాల్సిన సకల మర్యాదలని చేయండి. అందుకు ఏమైనా అవసరం ఉంటే నన్నడిగి తీసుకోండి.'' హెచ్చరించాడు ఇ.ఓ.

రామాచార్యులు తల ఊపి చిరునవ్వుతో చెప్పాడు.

''అలా కానిపక్షంలో ఈసారి పేపర్‌లో సస్పెండ్ అయినట్లుగా నాపేరు వస్తుంది. అంతేగా?''

మంత్రి సస్పెండ్ చేసింది సాక్షాత్తు రామాచార్యులి తమ్ముణ్ణే. ఆ సంగతి అతను ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌కి చెప్పలేదు.

***

రాష్ట్ర ఎండోమెంట్స్ శాఖ అధీనంలో ఉన్న ఆలయాలకి రాజకీయ నాయకులు, ముఖ్యంగా ఆ శాఖామాత్యులు వచ్చినప్పుడల్లా, సాఫీగా సాగే భక్తుల క్యూకి, ఆలయ స్టాఫ్‌కి కలిగే ఆటంకం రామాచార్యులకి అనుభవపూర్వకంగా తెలిసిన విషయమే.

మంత్రిగారు తన కుటుంబ సభ్యులతో కారు దిగారు. అంతకు గంట మునుపే వేలాదిమంది భక్తులు గల క్యూని నిలిపేసారు. మంగళ వాయిద్యాలతో, పూర్ణకుంభంతో, వేదపారాయణంతో ఆయనకి, ఆయన వెంట ఉన్న మందీ మార్బలానికి స్వాగతం పలికింది అర్చకుల బృందం. లోపలకి తీసుకెళ్ళి మంత్రి గోత్ర నామాలతో ప్రత్యేక పూజని నిర్వహించారు.

తర్వాత లక్ష్మీనరసింహస్వామి విగ్రహానికి కట్టిన పట్టు వస్త్రాలని విప్పుతీసి పంచె, కండువాలని మంత్రికి ఇచ్చాడు రామాచార్యులు. ఆ వస్త్రాలని చూడగానే మంత్రి మొహం నల్లగా మాడిపోయింది.

అవి చాలా చవకయిన, జరీ కూడా లేని నాసిరకం చేనేత వస్త్రాలు.

''ఇవేమిటండి? మన పొలంలో దిష్టి బొమ్మకి మాత్రమే ఇవి ఉపయోగించాలి'' చెప్పింది ఆయన పక్కనున్న ఆవిడ వాటిని చూసి.

వాటిని స్వీకరించడానికి ఆయన ఇష్టపడక ఆగ్రహంగా చెప్పాడు.

''ఇవి ఇంతదాకా ఏ ఆలయంలోనూ ఏ మంత్రికీ ఇవ్వనటువంటి నాసిరకం వస్త్రాలు. కాబట్టి నేను వీటికి అభ్యంతరం చెప్తూ తీసుకోడానికి నిరాకరిస్తున్నాను.''

''మీరు చేసేది పాపం. వీటిని వేలు చెల్లించి కొనేందుకు ఎందరో సిద్ధంగా ఉన్నారు. తీసుకోండి'' చెప్పాడు రామాచార్యులు.

''నేను తీసుకోను గాక వీటిని తీసుకోను. మా ఆవిడ మాత్రం మీరిచ్చినవి స్వీకరిస్తుంది'' రామాచార్యుల చేతిలోని చెంచులక్ష్మి అమ్మవారికి కట్టిన ధగ ధగలాడే, ఖరీదైన పట్టు వస్త్రాలని చూస్తూ చెప్పాడు మంత్రి.

''ఇవ్వనండి'' చిరునవ్వుతో చెప్పాడు రామాచార్యులు.

ఆ సమాధానానికి నిర్ఘాంతపోయాడాయన.

''ఆలయానికి వచ్చిన దంపతులిద్దరికీ శేషవస్త్రాలివ్వాలని ఆగమ శాస్త్రంలో ఉంది తెలుసా'' గద్దించాడు మంత్రి.

''ఆగమ శాస్త్రం మీకన్నా నాకు ఎక్కువ తెలుసు. ఎందుకంటే మీలా కేవలం దాని పేరు తెలుసుకుని వాడను. దాన్ని క్షుణ్ణంగా అధ్యయనం చేసాను'' అదే చిరునవ్వుతో చెప్పాడు రామాచార్యులు.

''నేనెవరో తెలుసా?'' పళ్ళు పటపట కొరుకుతూ అడిగాడు మంత్రి.

''అది తెలుసుకునే ప్రయత్నం ఎంత చేసినా లాభం ఉండటంలేదు.''

''ఆలయ మర్యాదని సక్రమంగా పాటించకుండా, పైగా నాకే ఎదురు సమాధానాలని చెప్పే నిన్నేం చేస్తానో చూడు'' రామాచార్యులు తొణక్కుండా నవ్వుతూండిపోయాడు.

''ఇంకా చూస్తారే? సస్పెండ్ చేయండి'' అందించింది అప్పటికే అవమానంతో మొహం ఎర్రబడ్డ పక్కనున్నావిడ.

దూరంగా వినయంగా నిలబడి వణుకుతూ జరిగేది చూస్తున్న ఇ.ఓ.తో చెప్పాడు మంత్రి.

''అంతా విన్నారుగా. సస్పెండ్ హిమ్ ఐ సే.''

''యస్ సర్'' బదులు చెప్పాడు ఇ.ఓ.

కోపంతో పెద్ద పెద్ద అడుగులు వేసుకుంటూ వెళ్తున్న మంత్రిని, ఆయన వెనకే వెళ్తున్న ఇ.ఓని అదే చిరునవ్వుతో చూసాడు రామాచార్యులు. తర్వాత లక్ష్మీనృసింహస్వామి విగ్రహానికి భక్తిగా నమస్కరించాడు.

గంటలో మంత్రి చెప్పిన మూడు పాయింట్లతో, మంత్రికి చేయాల్సిన మర్యాదని సక్రమంగా చేయలేదని, ఈ విషయం మీద ప్రశ్నించగా ఇచ్చిన అతని వివరణ సంతృప్తికరంగా లేదని తెలియచేస్తూ రామాచార్యులుకి సస్పెన్షన్ ఆర్డర్‌ని ఇచ్చాడు ఇ.ఓ.

అందులో మంత్రి గౌరవానికి తగిన పట్టు వస్త్రాలు ఇవ్వకుండా, సాదా ఖద్దరుబట్టలు ఇచ్చారన్నది మొదటి ఆరోపణ.


రెండోది మంత్రిగారి వెంట వచ్చిన ఆయన సతీమణికి అమ్మవారి శేషవస్త్రాలు అడిగినా ఇవ్వలేదన్న ఆరోపణ.

ఇక మూడోది, మంత్రి 'తనెవరో తెలుసా?' అని ప్రశ్నిస్తే 'అది తెలుసుకునే ప్రయత్నం చేస్తున్నానని' తల బిరుసు జవాబు ఇవ్వడం.

దాన్ని చదివిన రామాచార్యులు ఏ మాత్రం ఖంగారు పడలేదు. హైద్రాబాద్‌లోని తన అన్నయ్యకి ఫోన్ చేసి మాట్లాడాడు. అతను హైద్రాబాద్‌లో లాయర్.

***

తనమీద దాఖలైన సస్పెన్షన్ ఆర్డర్ అన్యాయమని, నిజానికి తను ఆలయ మర్యాద కాపాడానని, దాన్ని వెంటనే ఉపసంహరించుకునేలా ఇ.ఓని ఆజ్ఞాపించాలని రామాచార్యులు తరపున కోర్టులో పిటిషన్ దాఖలైంది. త్వరలోనే అది విచారణకి వచ్చింది. పేపర్‌ల వాళ్ళు ఊరుకుంటారా? ఈ భాగోతం మొత్తం పేపర్లలోకి ఎక్కించారు. టి.వి. ఛానళ్ళ వాళ్ళూ ఊరుకోలేదు.



మూడో వాయిదాలో రామాచార్యులని జడ్జి ప్రశ్నించాడు.

"నీకిచ్చిన సస్పెన్షన్ ఆర్డర్‌లోని అభియోగా లన్నీ అంగీకరిస్తావా?"

"తప్పుని అంగీకరిస్తానండి" జవాబు చెప్పాడు రామాచార్యులు.

"సరే. మొదటి అభియోగం. మన రాష్ట్రంలోని ఏ దేవాదాయ శాఖ అధీనంలో ఉన్న దేవాల యాన్ని ఆ శాఖామంత్రి సంద ర్శించినా, ఆయనకి విగ్రహానికి కట్టిన శేషవస్త్రాలు బహుకరించాలి అని నీకు తెలుసా?"

"తెలుసండి."

మంత్రిగారు మీ ఆలయానికి వచ్చిన రోజు నువు విగ్రహానికి ఇ.ఓ. ఇచ్చిన పట్టుపీతాంబరాలు ఎందుకు కట్టలేదు?" ప్రశ్నించాడు జడ్జి.

"నిత్యం స్వామివారికి మామూలు సాదా దుస్తులు కడుతూ, ఆ ఒక్క రోజూ, అదీ కేవలం మంత్రిగారికివ్వడం కోసం, పట్టు బట్టలు కట్టడం నాకు మనస్క రించ లేదండి. అందువల్ల నేను రోజూ కట్టేలాంటి మామూలు దుస్తులే స్వామివారికి కట్టాను. ఇక్కడో విషయం కోర్టువారికి మనవి చేస్తాను. శేషవస్త్రాలంటే ఆగమశాస్త్రం ప్రకారం విగ్రహానికి ధరింపచేసిన లేదా కప్పిన, లేదా స్పర్శించిన ఏ దుస్తులైనా అనే అర్థం. అవి తప్పని సరిగా పట్టువే అయి ఉండాలన్న నియమం లేదు. మంత్రిగారు మా ఆలయానికి వచ్చిన రోజు స్వామి వారికి ఏ దుస్తులయితే కట్టామో వాటినే ఆయనకి శేషవస్త్రాలుగా ఇచ్చాను. ఆలయ అర్చకుల విధులని నిర్వ చించే ఆగమశాస్త్రంలో ఎక్కడా మంత్రిగారికి పట్టు వస్త్రాలే ఇవ్వా లని పేర్కొనలేదు. మంత్రిగారిని మంచి చేసుకోవాలనో, ఆయనంటే భయంచేతో, మరే ఇతర కారణాల వల్లనో మాత్రమే ఈ రాష్ట్రంలో మంత్రికి పట్టుబట్టలు శేషవస్త్రా లుగా ఇచ్చే ఆనవాయితీ అభ్యాసంలో ఉంది తప్ప శాస్త్రంలో అలాగే చేయాలని ఎక్కడా లేదు. కాబట్టి నేనే శాస్త్ర ఉల్లంఘనా చేయలేదు."

"సరే. నువు పేర్కొన్న ఆగమ శాస్త్రంలో ఆల యానికి వచ్చిన దంపతుల్లో ఇద్దరికీ శేషవస్త్రాలు ఇవ్వాలని ఉంది కదా?" ప్రశ్నించాడు జడ్జి.

"ఉందండి" ఒప్పుకున్నాడు రామాచార్యులు.

"మరి ఆ రోజు మంత్రి వెంట వచ్చిన ఆయన భార్యకి నువు శేషవస్త్రాలు ఇవ్వలేదు. ఇది మర్యా దని అతిక్రమించడం కాదా?"

"కాదండి."

"ఎందుకు కాదు?"

"ఎందుకంటే ఆయన వెంట వచ్చింది ఆయన భార్య కాదు కనక."

కోర్టులో వెంటనే గుసగుసలు మొదల య్యాయి.

"ఆ విషయం నీకెలా తెలుసు?" ప్రశ్నించాడు జడ్జి.

"ఎలాగంటే మంత్రిగారి వివాహాన్ని నేనే జరి పించాను కనుక."

మళ్ళీ కోర్టు హాల్లో గుసగుసలు. రామాచార్యు లందించిన ఓ పాత శుభలేఖని చదివి జడ్జి తల పంకించాడు.

"సరే. మంత్రి నేనెవరో తెలుసా అనడిగితే 'అది తెలుసుకునే ప్రయత్నం చేస్తున్నాను' అని తలబిరు సుగా జవాబిచ్చావా?" ప్రశ్నించాడు జడ్జి.



"మంత్రిగారి ఆ ప్రశ్నకి ఆ సమాధానం నేను ఇవ్వడం వాస్త వమే కాని తలబిరుసుగా ఇవ్వడం మాత్రం తప్పు. నిజానికి నేనెంతో భక్తితో ఆ జవాబిచ్చాను. నా ఆధ్యాత్మిక గురువైన భగవాన్ శ్రీ రమణమహర్షి జీవించి ఉన్నంత కాలం 'నేను ఎవరో తెలుసుకో' అన్న హితబోధని లెక్కలేనన్నిసార్లు ఎంతోమందికి చేసారు. నేనా ఉపదేశాన్ని గురించి మంత్రిగారు ప్రస్తా వించారనుకుని ఆ సమాధానం చెప్పాను. ఆలయంలో దేవుని ఎదుట అలాంటి పవిత్ర సంభాష ణని చేసే సంస్కారం ఆయన కుందనుకున్నాను" సమాధానం చెప్పాడు రామాచార్యులు.

***

కొద్దిరోజులకి ఆ కేసుని కొట్టేస్తూ జడ్జిమెంట్ వచ్చింది. అందులో మంత్రి మీద ఈ కామెంట్‌ని చేసాడు జడ్జి.

'రెండు వందల ఎకరాలకి హక్కుదారుడైన లక్ష్మీనృసింహ స్వామికి కట్టుకోడానికి పనికి వచ్చిన వస్త్రం, స్వామి వారికి కప్పిన వస్త్రం తనకి పనికిరాదని మంత్రి నిరాకరించడం ఎంత మాత్రం సబబు కాదు. ఇది సాక్షాత్తు ఆ దేవుడ్ని అగౌరవ పర చడంగానూ అవమానపరచ డంగానూ కోర్టు భావిస్తోంది. ఆ ఆలయానికి వెళ్ళి మంత్రి ఆ శేషవ స్త్రాన్ని స్వీకరించవలసిందిగా తీర్పు ఇవ్వడమైనది.